

మలేరియా నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి: డీఎంవో

జియ్యమ్మవలస, మే14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నిర్మూలనే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) వై.మణి ఆదేశించారు. బుధవారం రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ పరిధి నిడగళ్లుగూడలో ఐఆర్‌ఎస్ ఏసీఎం ఐదు శాతం స్ప్రేయింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో ఈ స్ప్రేయింగ్ మరింత పకడ్బందీగా చేయించాలన్నారు. దీనిపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారే చెప్పాలా?


శ్యామలాంబ అమ్మవారు

- మూడు రోజుల్లో శ్యామలాంబ ఉత్సవాలు ప్రారంభం
- నిధులున్నా.. ముందుకు కదలని పనులు
- టెండర్లు పిలిచినా.. వర్క్ ఆర్డర్లు ఇవ్వని వైనం
- సహకరించని వైసీపీ పాలకవర్గం
- అధికారుల తీరుపైనా విమర్శలు
- మంత్రి చెప్పినా మారని పరిస్థితి
- భక్తులకు ఇబ్బందులు తప్పవా?
- పెదవి విరుస్తున్న పట్టణవాసులు

పార్వతీపురం/ సాలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీల్లో నిధులు లేక పనులు జరగకపోవడం సహజం. కానీ సాలూరులో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. దాదాపు 15 ఏళ్ల తర్వాత జరిగే శ్యామలాంబ ఉత్సవాల పనులకు నిధులు మంజూరై రెండు నెలలు గడిచినా ఇంతవరకు అతీగతీ లేదు. వైసీపీ పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు కదలడం లేదు. దీనిపై మంత్రి సంధ్యారాణి ఆదేశించినా పరిస్థితి మారలేదు. ఉత్సవాలు విజయవంతంగా జరిగితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఆలోచనతోనే పురపాలక సంఘం నుంచి సహకారం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కాగా మరో మూడు రోజుల్లో పండగ ప్రారంభమవగా..


సిరిమాను తిరిగే రోడ్డులో గుంతలు ఇలా..

అధికారులు ఇప్పటివరకు వర్క్ ఆర్డర్లు కూడా ఇవ్వలేదు. దీనిపై పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. అభివృద్ధి పనులకు వైసీపీ పాలకవర్గం అడ్డు తగలడంపై మండిపడుతున్నారు. పండుగకు వచ్చే భక్తులకు ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సాలూరు మున్సిపాల్టీలో 29 వార్డులున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ వార్డులను వైసీపీ వారే కైవసం చేసుకున్నారు. అయితే వైసీపీ పాలకవర్గం కొలువుదీరినతర్వాత మున్సిపాల్టీలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులేవీ జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మున్సిపాల్టీపై దృష్టి సారించారు. పెండింగ్ బిల్లులు చెల్లించి.. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ క్రమంలోనే 15 ఏళ్ల తర్వాత జరిగే శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. తాగునీరు, పారిశుధ్యం నిర్వహణ, రోడ్లపై గుంతల పూడ్చివేత, సామూహిక మరుగుదొడ్ల మరమ్మతులు, అవసరమైన టాయిలెట్లు, కల్వర్టుల నిర్మాణం, బ్లీచింగ్, స్ప్రేయింగ్ మిషన్లు, మలేరియా నివారణ మందు పిచికారీ తదితర పనుల కోసం రూ.2కోట్లు కేటాయించారు. మార్చి 17న మున్సిపల్ ఖాతాలో ఆ నిధులు జమయ్యాయి. అయితే వైసీపీ పాలకవర్గం సహకరించకపోవడం వల్ల ఇప్పటివరకు పనులు ముందుకు సాగలేదు. దీంతో మంత్రి సంధ్యారాణి ఈ నెల 5న జాయింట్ కలెక్టర్ శోభిక ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పండగ ఏర్పాట్లపై చర్చించారు. పనులు జరగకపోవడంపై (మిగతా 8వ పేజీలో..)




స్ప్రేయింగ్ మిషన్‌లు లేక సీసాలో మలాథియాన్ వేసి పిచికారీ చేస్తున్న మున్సిపల్ కార్మికుడు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట

- మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం పరుగులు
- రేషన్‌కార్డు పొందాలంటే దంపతులకు తప్పనిసరి



బెలగాం, మే 14 (ఆంధ్రజ్యోతి): విడిగా దంపతులు నూతన కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా.. కార్డులో భార్య పేరు చేర్చాలన్నా.. మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి. దీంతో మూడు నెలల కిందట వివాహాలైన వారంతా సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఆ కాల వ్యవధి దాటిన వారంతా ఇప్పుడు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీంతో గత మూడు రోజులుగా ఆ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. బుధవారం 20 మ్యారేజ్ రిజి స్ట్రేషన్లు అయినట్టు పార్వతీపురం సబ్‌రిజిస్ట్రార్ వి.నాగరాజు తెలిపారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

- శ్యామలాంబ పండుగ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష
- సమన్వయంతో పనిచేయాలని సూచన

పార్వతీపురం రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): సాలూరులో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న శ్యామలాంబ ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. 'అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి. పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడపాలి. జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తాం. వాహనాల పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసుకోవాలి. సిరిమాను తిరిగే ప్రాంతాలతో పాటు అన్ని ముఖ్య కూడళ్లలో పోలీస్ బందోబస్తుతో పాటు 30 రోప్ పార్టీలను సన్నద్ధం చేయాలి. సాలూరు పట్టణ రహదారుల్లో గుర్తించిన 22 గుంతలను తక్షణమే పూడ్చాలి. శిథిల గృహాలు, భవనాలకు సమీపంలో ఉన్న విద్యుత్ తీగల వద్ద ప్రజలు ఉండకుండా చూసుకోవాలి. 15 ప్రాంతాల్లో అదనంగా 50 తాత్కాలిక మరుగుదొడ్లు, చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. 14 వైద్య బృందాల ద్వారా 378 మంది వైద్య సిబ్బంది సేవలు అందించాలి. అంబులెన్స్‌లు, మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి. దేవాలయ అలంకరణ, క్యూలైన్ల ఏర్పాటుతో పాటు భక్తులు, చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.' అని కలెక్టర్ తెలిపారు. సీతానగరం, మామిడిపల్లి, శంబర పీహెచ్‌సీల పనులను త్వరగా పూర్తి చేయాలి. జిల్లాలో మలేరియా కేసులు ఉండడానికి వీలు లేదు. ఇందుకోసం గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలి.' అని కలెక్టర్ తెలిపారు. 'లోటల్టేజ్ సమస్య తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్‌ను నిలిపివేస్తాం. అయితే ఆ సమయంలో కమిటీ సహకారంతో జనరేటర్లను ఏర్పాటు చేస్తాం.' అని విద్యుత్‌శాఖ ఎస్ఈ వెల్లడించారు.

ప్రతినెలా అనీమియా యాక్షన్ కమిటీ సమావేశం

బెలగాం: సచివాలయ పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఇకపై ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కమిటీ సమావేశంలో తీసుకున్న చర్యలు, తద్వారా వచ్చిన ఫలితాలపై ఇక నుంచి సమీక్షిస్తామని తేల్చి చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన

- రూ.7కోట్లతో పాతపనుకువలసలో ఏర్పాటు

సీతంపేట రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): సీతంపేటకు సమీపంలోని పాతపనుకువలస గ్రామ సరిహద్దులో సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్క్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేశారు. 27 ఎకరాల్లో దీనిని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.7 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ ఎంఈ పార్క్ వల్ల స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి గిరిజన గ్రామానికి తాగునీరు, రహదారి సౌకర్యం కల్పనకు అధిక ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లు రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఎంఎస్ఎంఇ పార్క్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి తదితరుల పేర్లను అధికారులు విస్మరించారు. దీనిపై ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీ మోహన్‌ను వివరణ కోరగా డీఆర్‌వో ఇచ్చిన పేర్లను మాత్రమే శిలాఫలకంలో వేశామని తెలిపారు.



ఎంఎస్ఎంఈ పార్క్ కోసం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

- విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యలు, స్వీయ రక్షణపై అవగాహన

పార్వతీపురం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర, విపత్తుల వేళ క్షణాల వ్యవధిలో ప్రజలను ఏవిధంగా కాపాడాలన్నది స్పష్టంగా తెలిపేలా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ , పోలీసు, అగ్ని మాపక శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పాల్గొని మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. రెవెన్యూ, వైద్య, ఆరోగ్యశాఖాధికారులు ఎలా సేవలు అందిస్తారో తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే .. ప్రజలు ఎలా అప్రమత్తం కావాలి. స్వీయ రక్షణ ఎలా పొందాలో వివరించారు. ప్రమాదాలు సంభవించి నప్పుడు చేపట్టాల్సిన సహాయక చర్యలను తెలియజేశారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో కె.హేమలత, ప్రత్యేక ఉపకలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు ఆసక్తిగా మాక్‌డ్రిల్‌ను తిలకించారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా అప్రమత్తమవుతూ అన్నింటికీ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.


విపత్కర సమయాల్లో ప్రజలను తరలించే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వర్షంతో అస్తవ్యస్తం

- ఉదయం ఎండ.. సాయంత్రం కుండపోత

6లో

దక్షిణ భారతదేశ యాత్రకు వెళతారా?

- ఐఆర్‌సీటీసీ ప్రత్యేక సేవలు

6లో

డ్రోన్లతో వ్యవసాయం

- ఉమ్మడి జిల్లాలో 34 రైతు బృందాలకు మంజూరు
- రాయితీతో పాటు బ్యాంకు రుణం
- సాగులో పెట్టుబడులు తగ్గించేందుకు ప్రభుత్వ చర్యలు



రాజాం, మే 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో యాంత్రీకరణ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే అనేక ఆధునిక యంత్రాలు వచ్చేశాయి. డ్రోన్ల వినియోగం కూడా పెంచాలని ఈ ప్రభుత్వం సంకల్పించింది. కూలీల ధరలు, కూలీల కొరతతో వ్యవసాయమంటేనే రైతులు వెనకడుగేసే పరిస్థితి ఉంది. ఈ సమస్య నుంచి కొంత ఉపశమనం పొందాలంటే డ్రోన్లను విరివిగా వాడాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. వాటిని రాయితీపై అందివ్వనుంది. ఉమ్మడి జిల్లాలో 34 రైతు బృందాలకు తొలి విడతగా మంజూరు చేయనుంది. తొలి విడతగా ఉమ్మడి జిల్లాలో 34 రైతు బృందాలకు డ్రోన్లను మంజూరు చేయనున్నారు. విజయనగరం జిల్లాలో 24 రైతు బృందాలకు, పార్వతీపురం మన్యంలో 10 బృందాలకు డ్రోన్లు మంజూరు చేయనున్నారు. ఇందుకోసం విజయనగరం జిల్లాలో 13 మంది.. పార్వతీపురం మన్యంలో 9 మంది శిక్షణ పొందారు. ఒక్కొక్కరిపై శిక్షణకు రూ.70 వేలు ఖర్చుచేశారు. ఐదుగురు సభ్యులున్న రైతుల బృందానికి ఒక డ్రోన్ మంజూరు చేస్తారు. వీరిలో ఒకరు సాంకేతిక విద్య, మరొకరు ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఇప్పటికే ఎంపికైన వారికి గుంటూరు, విజయవాడలో శిక్షణనిచ్చారు. త్వరలో మరికొందరు వెళ్లనున్నారు. మహిళా రైతులకు సైతం అవకాశం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) లైసెన్స్ కూడా మంజూరు చేస్తారు. సుమారు రూ.10 లక్షలు విలువచేసే డ్రోన్లను రాయితీపై అందిస్తారు. లబ్ధిదారుడు తన వాటాగా తొలుత రూ.5 లక్షలు చెల్లించాలి. మిగిలిన రూ.5 లక్షలకు బ్యాంకుల నుంచి రుణం వస్తుంది. రెండు నెలల తరువాత బ్యాంకు ఖాతాలో రాయితీ సొమ్ము జమ చేయనుంది. రైతు పెట్టుబడిగా పెట్టిన రూ.5 లక్షలు వెనక్కి ఇచ్చేస్తుంది. రుణాన్ని నెలవారీ వాయిదా పద్ధతిలో జమ చేయించేలా చర్యలు తీసుకుంటోంది. సాగులో ఖర్చులు తగ్గించుకునేందుకు ఇదే ఉత్తమ మార్గమని వ్యవసాయా ధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో అన్నదాతలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో 4.26 లక్షల ఎకరాలు, రబీలో 2.59 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. మొత్తం 3.56 లక్షల మంది అన్నదాతలుండగా.. వారిలో మూడొంతుల మంది చిన్నసన్నకారు రైతులేనని గణాంకాలు చెబుతున్నాయి. కాగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రైతులు ప్రైవేట్ డ్రోన్ల సాయంతో సస్యరక్షణ చేపడుతున్నారు. డ్రోన్‌తో రోజుకు పది ఎకరాల్లో సస్యరక్షణ చేపట్టవచ్చని వారు చెబుతున్నారు.

పక్కాగా రీసర్వే: సబ్ కలెక్టర్

సీతానగరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రీసర్వే పనులను పక్కాగా చేపట్టాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీసీఎల్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం దయానిధిపురంలో జరుగుతున్న రీసర్వే పనులపై సచివాలయంలో సమీక్షించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది హాజరు, రేషన్ కార్డుల్లో మార్పులు, సవరణల రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత రీసర్వే పనులపై ఇన్‌చార్జి తహసీల్దార్ ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. శాఖాపరమైన సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి పనికీ జిల్లా కేంద్రానికి రావడం సమంజసం కాదన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

వర్షంతో అస్తవ్యస్తం

ఉరుములు... మెరుపులు... పిడుగులు.. ఈదురు గాలులు... వర్షం ఉమ్మడి జిల్లాలో బుధవారం బీభత్సం సృష్టించాయి. రోజంతా ఎండలు మండిపోయాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. ఈదురుగాలులతో అనేక ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అసలే అంతంతమాత్రంగా ఉన్న మామిడి పంట నేలరాలింది. కొన్నిచోట్ల అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

-ఆంధ్రజ్యోతి బృందం


భామిని: నేరడిలో మొక్కజొన్న గింజలను బస్తాల్లోకి ఎత్తుతున్న రైతులు


భామిని: పసుకుడిలో మొక్కజొన్న గింజలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం


గరుగుబిల్లి: ఉల్లిభద్ర ప్రాంతంలో విద్యుత్ వైర్లపై పడిన చెట్టు


రాజాం: మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు


రాజాం: చెరువును తలపిస్తున్న మల్లికార్జున కాలనీ


గరుగుబిల్లి: సాంబన్నవలసలో కురుస్తున్న వర్షం


మక్కువలో కురుస్తున్న వర్షం



సంతకవిటి: పోతురాజుపేటలో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు


వీరఘట్టం: జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపునీరు

దక్షిణ భారతదేశ యాత్రకు వెళతారా?

● ఐఆర్‌సీటీసీ ప్రత్యేక సేవలు


పార్వతీపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశ యాత్రలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ హైదరాబాద్ నుంచి 'భారత్ గౌరవ్ 'పేరుతో ప్రత్యేక రైలును ఏర్పాటు చేసిందన్నారు. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ప్యాకేజీ ఇలా...

అరుణాచలం- మధురై- రామేశ్వరం యాత్ర

ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు 8 రాత్రులు, 9 పగళ్ల యాత్ర ఉంటుంది. అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులలో ఉన్న పుణ్యక్షేత్రాలు దర్శించవచ్చు. ఈ ప్రయాణానికి పర్యాటకులు రూ.14,700 చెల్లించాల్సి ఉంటుంది





హరిద్వార్.. వైష్ణోదేవి యాత్ర

జూన్ 3 నుంచి 12వ తేదీ వరకు 9 రాత్రులు, పది పగళ్ల. హరిద్వార్, హృషికేష్, ఆనందపూర్, నైనాదేవి ఆలయం, అమృతసర్, మాతా వైష్ణోదేవి ఆలయాల సందర్శన ఉంటుంది. దీని కోసం రూ.18,510 చెల్లించవలసి ఉంటుంది.

జ్యోతిర్లింగాల యాత్ర

జూలై 5 నుంచి 23వ తేదీ వరకు 8 రాత్రులు, 9 పగళ్ల. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్టేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగపూర్. పర్యాటకులు రూ.14,700 చెల్లించాలి. ఈ దక్షిణ భారతదేశ యాత్రలో రైలు, బస్సు, హోటల్ సదుపాయాలను ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేస్తుందన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, మంచి నీళ్ల సీసాలు, పర్యాటకుల ఆలయాల సందర్శన సమయంలో గైడ్ సేవలను ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 040-27702407, 9701360701, 9281495845, 9281495843, 9281030712, 9281030740 నెంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు.



కాశీ-అయోధ్య, నైమిశారణ్యం-ప్రయాగరాజ్ యాత్ర

జూన్ 14 నుంచి 22 వరకు 8 రాత్రులు, 9 పగళ్ల. కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగరాజ్, శ్రీంగవేరమ్ లయాలను దర్శించుకొనే అవకాశం ఉంటుందన్నారు. దీని కోసం భక్తులు రూ.16,200 వరకు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



వైభవంగా పోలమ్మ ఆలయ ప్రారంభోత్సవం

గరుగుబిల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): సుంకి గ్రామంలో పోలమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.


పోలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రామమందిరం..

వీరఘట్టం, మే 14 (ఆంధ్రజ్యోతి): చిట్టిపూడివలసలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న కోదండ రామ మందిర ప్రారంభోత్సవాలు బుధవారంతో ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహాన్నదానం చేశారు.


పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా నీలమ్మతల్లి ఉత్సవాలు


ఎల్విన్‌పేటలో నీలమ్మతల్లి పాదాలను ఊరేగిస్తున్న భక్తులు


వ్యాపారమ్మ ఘటాలను మోస్తున్న మహిళలు

గుమ్మలక్ష్మీపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట గ్రామదేవత నీలమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోకి తీసుకొచ్చిన అమ్మవారి పాదాలను తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు. అనంతరం చల్లదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● గుమ్మలక్ష్మీపురం గ్రామ దేవత వ్యాపారమ్మ పండుగ సందర్భంగా మొదటి రోజు బుధవారం ఘటాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ఘటాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు.

ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం

● అన్నదాతల కోసం 155251 టోల్ ఫ్రీ నెంబరు

● వాట్సాప్ నెంబర్ 8331056028 కూడా..

● వినియోగించుకోవాలంటున్న అధికారులు

విజయనగరం కలెక్టరేట్, మే 14(ఆంధ్ర జ్యోతి):అన్నదాత తన పంటలకు సంబంధించి ఇంటి నుంచే సమస్యను చెప్పుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రైతుల సందేహాల నివృత్తి కోసం అత్మ ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం (గుంటూరు)లో సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైతులు తమ సమస్యలపై 155251 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. అలాగే, చీడపీడల సమస్యలు తెలుసుకోవడానికి 8331056028 వాట్సాప్ నెంబరు కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులు తమ సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. వారి సమస్యలను తెలుసుకుని వెంటనే వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. చీడపీడలు ఆశించినా?, ఎటువంటి పురుగు మందులు పిచికారి చేయాలి? ఎటువంటి ఎరువులు వేయాలి? వంటివి తెలుసుకోవడానికి ఒక్క ఫోన్ చేస్తే సమాచారం వస్తుంది. పంట పొలాల్లో పురుగులు, తెగుళ్లు ఉంటే సరైన సమాచారం కోసం వాటి ఫొటోలను తీసి వాట్సాప్ నెంబర్‌కు పంపిస్తే దానికి అనుగుణంగా శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు అందుతాయి. వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్థక, మత్స్య, పట్టుపరిశ్రమకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకోచ్చు. పంటల రకాలు, విత్తన శుద్ధి, పోషక సమస్యలు, కలుపు, పురుగు, తెగుళ్ల, యాజమాన్యం, పాడి పశువులు, సన్న జీవాల యాజమాన్యం, చేపల పెంపకంపై రైతులకు తగిన సమా చారం అందిస్తారు. ఒకే ప్రాంతం నుంచి ఒకే రకమైన సమస్యలు ఎక్కువ మంది రైతుల నుంచి వస్తే దాన్ని తీవ్రంగా పరిగణిస్తారు. దీనిపై జిల్లా స్థాయిలో ఉన్న వనరుల కేం ద్రానికి సమాచారం అందిస్తారు. ఆ ప్రాంతం లో అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తలతో క్షేత్ర స్థాయిలో సందర్శన చేసి, ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. సమస్యకు అనుగుణంగా రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారు. రైతులు ఈ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.


కాల్ సెంటర్‌లో సిబ్బంది

వినియోగించుకోవాలి

రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నా? ఎటువంటి సలహాలు కావాలన్నా వ్యవసాయ అధికారులు వద్దకు వెళ్లకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబరు ఫోన్ చేయవచ్చు. ప్రతి రైతు ఈ సేవలను వినియోగించుకోవచ్చు. అవసరమైతే పంట తెగుళ్లపై ఫొటో తీసి వాట్సాప్ చేయవచ్చు. రైతులకు కావాల్సిన సూచనలు, సలహాలు అందజేస్తారు.

- వీటీ రామారావు, జేడీ, వ్యవసాయ శాఖ



గుంటూరులోని కాల్ సెంటర్ భవనం

చదువు ఆపేసి.. అరక పట్టి

● ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న కొత్తపెంట రైతు

● 10 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు

● జీరో బడ్జెట్‌తో సిరులు కురిపిస్తున్న వైనం

● ఆదర్శంగా నిలుస్తున్న విశ్వనాథం

● ప్రభుత్వం నుంచి ఉత్తమ రైతు అవార్డు

బొబ్బిలి/రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమంటే ఆయనకు మక్కువ. అరకపట్టి పొలం దున్నడమంటే ఇష్టం. అందరిలా కాకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆలోచించాడు. తనకున్న 10 ఎకరాల్లో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా వివిధ రకాల పంటలను పండిస్తున్నాడు. జీరో బడ్జెట్‌తో సిరులు కురిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. దీంతో ఇటీవల ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డును అందుకున్నాడు. ఆయనే బొబ్బిలి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన రైతు చేడవరపు విశ్వనాథం. ఇంటర్మీయట్ అనంతరం పాలిటెక్నిక్‌లో చేరిన విశ్వనాథం వ్యవసాయం పై ఆసక్తితో చదువుని మధ్యలో ఆపేశాడు. గ్రామంలో అందరి రైతుల్లాగే రసాయన ఎరువులతో పంటలను సాగు చేసేవాడు. అయితే, ఈ ఎరువులతో సాగుచేసే పంటలను తిన డం వల్ల మనుషుల్లో బీపీ, సుగర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని దినపత్రికలు, టీవీల్లో వచ్చిన వార్తలను విశ్వనాథం చూశాడు. దీంతో తన ఆలోచనను మార్చుకున్నాడు. భవిష్యత్ తరాల రైతులకు ఆదర్శంగా ఉండాలని నిర్ణయించుకుని ఆరేళ్ల కిందట ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశాడు. తొలుత ఒక ఎకరా పొలంలో ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టాడు. దానిలో వచ్చిన దిగుబడి, లాభాలను చూసి ఇప్పుడు తన 10 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు.


ప్రకృతి సాగు ద్వారా పండిస్తున్న బొప్పాయి


అరటి పంట సాగు చేస్తున్న దృశ్యం

ప్రస్తుతం వరి, చెరుకు, బొప్పాయి, టమాటా, కూరగాయలు, పుచ్చకాయలు, మామిడి పండిస్తున్నాడు. పంట ప్రారంభం నుంచే తమ వద్ద ఉన్న రెండు దేశీ ఆవుల పేడ, వ్యర్థాలనే ఎరువులుగా వినియోగిస్తున్నాడు. కేవలం ప్రకృతి సిద్ధమైన ఎరువులు అనగా ఎండిన ఆవు పేడ, ఆకు తుక్కు, వర్మీ కంపోస్టు (వానపాములు), వేప పిండి వంటి పదార్థాలు వాడకం, పంచగవ్య, జీవామృతం, బ్రహ్మాస్త్రం వంటి ఆర్గానిక్ ఎరువులను పిచికారీ చేస్తున్నాడు. దీంతో రూపాయి ఖర్చు లేకుండా అధిక దిగుబడి సాధించి లాభాలు పొందుతున్నాడు. కషాయాలతో చీడపీడల బారి నుంచి కాపాడుకుంటూ సిరులు కురిపిస్తున్నాడు.

ప్రకృతి సాగుపై విశ్వనాథం మాటల్లోనే..

రైతులు పండించిన పంటను ప్రతి ఒక్కరూ ఏదో రూపంలో ప్రతిరోజూ తింటున్నారు. కానీ, ఆ ఆహారంలో హాని కలిగించే రసాయనాలు ఉంటున్నాయి. కృత్రిమ ఎరువులు, పురుగు మందులు వాడడంతో పెట్టుబడి పెరిగి రైతులు అప్పులు పాలవుతున్నారు. దాన్ని చూసి కొంత మంది రైతులనైనా ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకురావాలని నిర్ణయించుకున్నాను. ప్రకృతి వ్యవసాయం మొదలుపెట్టిన నాటి నుంచి ఇప్పటివరకూ ఆర్థికంగా, మానసికంగా సంతోషకరంగా ఉంది. ప్రతి ఒక్క రైతు ఈ విధానాన్ని పాటించాలి. ఇది ఖర్చు లేని వ్యవసాయం.

● మూడెకరాల్లో చెరకు సాగు చేస్తున్నాను. విత్తనం నాటడం, నీరు కట్టడం, ద్రవ, ఘన జీవామృతాల తయారీ, పిచికారీకి కలిపి మొత్తం రూ.60 వేలు ఖర్చవుతుంది. దిగుబడి 40 టన్నులు వచ్చింది. టన్ను రూ. 4 వేలకు అమ్మగా రూ. 1.60 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులు పోనూ రూ.లక్ష లాభం వచ్చింది.


ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న విశ్వనాథం(ఫైల్)

● రెండు ఎకరాల్లో టమాటా వేశాను. నారు కొనుగోలు, గొప్పులు తవ్వడానికి, నీరు కట్టడానికి, ఘన, ద్రవ జీవామృత ఎరువులకు, కాయలు ఏరడానికి ఎకరాకు రూ.30 వేలు వ్యయమైంది. దిగుబడి ఎకరాకు 10 టన్నులు వస్తోంది. టన్ను రూ.20 వేలకు అమ్ముతున్నాం. ఆ లెక్కన రెండెకరాలకు రూ.4లక్షల ఆదాయం రాగా ఖర్చులు పోనూ రూ.3.40లక్షలు వచ్చింది.

● ఎకరాన్నరలో బొప్పాయి వేశాను. 250 గ్రాముల విత్తనాలు రూ.10 వేలకు కొన్నాను. ఎకరాకు 70 మొక్కల చొప్పున నాటాను. ఇవి తొమ్మిది నెలలకు కాయలు కాస్తాయి. పంట బాగుంది.

●ఎకరా విస్తీర్ణంలో వరి పంట వేశాను. దిగుబడి 20 క్వింటాళ్లు వచ్చింది. విత్తనాలు నాటడానికి, కలుపు తీయడానికి, కోతకు, నూర్పు చేయడానికి రూ.25 వేలు ఖర్చు అయింది. ప్రకృతి సాగు కావడంతో క్వింటా రూ.4 వేలు పలుకుతోంది. రూ.80 వేల ఆదాయం రాగా, ఖర్చులు పోనూ రూ.55 వేల లాభం వచ్చింది.

ఇంటికో మురుగు గుంత

● నిండితే దూరంగా పారబోత ● కాలువ లేకపోవడమే కారణం ● ఇదీ.. కొయ్యపేటలో దుస్థితి

భోగాపురం, మే14(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ప్రతి ఇంటి ముందు మురుగునీటి గుంత ఉంటుంది. అక్కడ మురుగునీటి కాలువలు లేకపోవడమే కారణం. మురుగునీటి గుంతల వల్ల దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందడం వల్ల ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. ఇదీ.. భోగాపురం పంచాయతీ పరిధిలోని కొయ్యపేట దుస్థితి. గ్రామంలో సుమారు వంద ఇళ్లు ఉన్నాయి. సీసీ రోడ్డు కూడా ఉంది. అయితే ఇళ్లల్లో వాడుక నీరు, వరదనీరు పోయేందుకు కాలువ లేదు. దాంతో ఇళ్లలో వాడుక నీరు కోసం ప్రతి ఇంటి ముందు గుంతను తవ్వుకునే పరిస్థితి నెలకొంది. మురుగునీటి గుంత నిండితే దూరంగా వారే పారబోస్తున్నారు. ఈక్రమంలో స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వాలు మారినా ఇక్కడి పరిస్థితులు మారడంలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ● దీనిపై ఈవోపీఆర్‌డీ కె.గాయత్రి వివరణ కోరగా కొయ్యపేటలో కొంతమేర మురుగుకాలువ ఉందన్నారు. అయితే పూర్తిస్థాయిలో కాలువ ఏర్పాటుకు స్థల సమస్య ఉందన్నారు. దాంతో కాలువ నిర్మాణం చేపట్టే పరిస్థితి లేకుందన్నారు.




ఇళ్ల ముందు తవ్విన మురుగునీటి గుంతలు

సివిల్ సప్లైస్ కమిషనర్‌కు కలెక్టరు లేఖ

విజయనగరం, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సివిల్ సప్లయ్ డీఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన మీనాకుమారిపై సివిల్ సప్లైస్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు కలెక్టరు డాక్టరు అంబేడ్కర్ ఆంధ్రజ్యోతికి బుధవారం తెలిపారు. ఆమెపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించాలని ఇటీవల నిర్వహించిన డీఆర్‌సీలో హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఆదేశించిన నేపథ్యంలో కలెక్టరు చర్యలు చేపట్టారు.

పాలిసెట్ ఫలితాల విడుదల

విజయనగరం కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఫలితాలు బుధవారం రాత్రి విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 95.36 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 6938 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వీరిలో 6,616 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,083 మంది బాలురకు గానూ 3,834, 2,855 బాలికలకు 2782 మంది ఉత్తీర్ణత సాధించారు. గతనెల 30న జిల్లాలో 23 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లాలోని షేక్ అబ్దుల్ ముజీబ్‌కు రాష్ట్రస్థాయిలో 171వ ర్యాంకు వచ్చింది. చిల్లా పూర్ణసంజయ్‌కు 207వ ర్యాంకు, మండల వాగ్దేవికి 269వ ర్యాంకు సాధించారు.

ఉష్ణతాపాన్ని తగ్గించడమే లక్ష్యం

విజయనగరం కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో భాగంగా ప్రస్తుత వేసవి దృష్ట్యా ఈనెల బీట్ ది హీట్‌గా ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టరు అంబేడ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు ఈనెల 17న స్వచ్ఛాంధ్ర దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వేడి ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి, ప్రజల్లో అవగాహన పెంచడానికి అనుగుణంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు రూపొందించారన్నారు.

రేషన్ అందడంలేదని ఫిర్యాదు

రాజాం, మే 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహనం రెండు నెలలుగా రాకపోవడంతో రేషన్ లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని 17వ వార్డు టీడీపీ ప్రతినిధి పెంకి గౌరీశ్వరరావు తహసీల్దారు కృష్ణంరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రెండు నెలలుగా రేషన్ కోసం లబ్ధిదారులు చూస్తున్నారన్నారు. రేషన్ డీలరుతో చర్చించి సరుకులు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కళాశాలకు వీసీఐ బృందం

గరివిడి, మే 14(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని పశువైద్య కళాశాలను వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) ముగ్గురు సభ్యుల బృందం బుధవారం సందర్శించింది. మూడో సంవత్సరం విద్యార్థులకు అనుమతులు, పూర్తిస్థాయిలో కళాశాలలో వసతులు, ఫ్యాకల్టీ తదిరత అంశాలను పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి బృందం విచ్చేసింది. మూడు రోజుల పాటు వివిధ అంశాలను వారు పరిశీలించనున్నారు.

అమ్మవారి ఆదాయం రూ.3.24 లక్షలు

రాజాం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి హుండీల ద్వారా రూ.3,24,800 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈవో శ్రీనివాస్ తదితరుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించామని ఈవో తెలిపారు.

మురళీ నాయక్‌కు నివాళి

గరివిడి, మే 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీ నాయక్‌కు నివాళి అర్పిస్తూ బుధవారం గరివిడిలో ర్యాలీ నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ ఎస్‌ఐ దండు హేమసుందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గరివిడి బ్రిడ్జి నుంచి పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీకాంత్, కోచ్ పీటీఆర్ నాయుడు, వాలీబాల్ కోచ్ గోపాల్, రమేష్, టీకు నర్సింగ్, అన్వర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

విజయనగరం దాసన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం జీపు జాత ముగింపు కార్యక్రమాన్ని కోట వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, జగన్మోహన్, లక్ష్మి, రవికుమార్, సుధారాణితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

● గజపతినగరం: కార్మిక చట్టాలను రద్దు చేసి వారిని కట్టు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకిస్తూ ఈనెల 20న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు.

పార్టీ కోసం సమష్టిగా పనిచేయండి

● ఎస్.కోట నేతలకు అధిష్ఠానం సూచన



పల్లాతో ఎమ్మెల్యే లలితకుమారి, గొంప కృష్ణ

శృంగవరపుకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న సమస్యలను సామరస్యంతో పరిష్కారించుకోవాలని, అంతర్గత విబేధాలు లేకుండా ప్రతి ఒక్కరూ పార్టీ కోసం సమష్టిగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఎస్.కోట నేతలకు సూచించారు. బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో శృంగవరపుకోట, సూళ్లూరుపేట నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. చంద్రబాబు విజన్‌ను క్షేత్రస్థాయికు తీసుకెళ్లే బాధ్యత అందరిపై ఉందన్నారు. పార్టీ మరింత బలోపేతం జరిగేందుకు ప్రతి కార్యకర్త నాయకుడిలా పనిచేయాలన్నారు. శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ తదితరులున్నారు.

ఏజీపీ శ్రీనివాస్‌కు అభినందనలు



ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న ఏజీపీ శ్రీనివాస్

రాజాం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన న్యాయవాది పి.శ్రీనివాస్‌ను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పార్టీ కార్యాలయంలో అభినందించారు. బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలను శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుకు పైగా న్యాయవాద వృత్తిలో ఉండటమే కాకుండా వృద్ధాశ్రమాన్ని నడుపుతూ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీనివాస్‌ను వారు ప్రశంసించారు. ప్రభుత్వ న్యాయవాదిగా ఉత్తమ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో గురవాన నారాయణరావు, శాసపు రమేష్‌కుమార్, కె.సూరపునాయుడు, క్రాంతికుమార్, వల్లూరు గణేష్, ముగడ శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

పోరాంలో ఆలయ ప్రారంభోత్సవం

రేగిడి, మే 14, (ఆంధ్రజ్యోతి): మండలంలో పోరాంలో గణపతి, సుబ్రహ్మణ్య సహిత అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజున ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ హాజరై పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామిజీ పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు పోరాపు లక్ష్మంనాయుడు, గేదెల బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'శుభం' చిత్ర యూనిట్ సందడి



శుభం చిత్రంలోని నటీనటులు

విజయనగరం రింగురోడ్డు, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్థానిక సప్తగిరి మల్టీప్లెక్స్‌లో బుధవారం సెకెండ్ షో సమయంలో శుభం చిత్ర యూనిట్ సందడి చేశారు. చిత్ర యూనిట్‌ను థియేటర్ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిత్ర నటీనటులు షాలినీ, శరియా, హర్షిత్, చరణ్, శర్వాణి, శ్రీనివాస్, వంశీ, దర్శకుడు కె.ప్రవీణ్ ప్రేక్షకులతో మాట్లాడారు. విజయనగరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమా ఘన విజయం సాధించినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమంత కొత్తగా నిర్మాణ సంస్థ స్థాపించి మమ్మల్ని ప్రోత్సాహించారన్నారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజరు నాయుడు ఉన్నారు.

బకాయిలు చెల్లించండి

విజయనగరం క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణాశాఖాధికారులు సీజ్ చేసిన వాహనాలపై విధించిన అపరాధ రుసుం, టాక్స్ బకాయిలు తక్షణమే వాహన యాజమానులు చెల్లించాలని రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సంబంధిత వాహన యాజమానులకు నోటీసు జారీ చేశామన్నారు. స్పందించని వాహనాలను ఈనెల 27న తదుపరి సమాచారం లేకుండా వేలం వేస్తామన్నారు. 26లోపు బకాయి అపరాధ రుసుం, పన్ను చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి గలవారు ఉప రవాణాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నేడు మానాపురం రైల్వే గేటు మూసివేత

దత్తిరాజేరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం రైల్వే క్రాసింగ్ గేట్ వద్ద మూడోలైన్ పనుల నేపథ్యంలో ఈనెల 15న రాత్రి 9 నుంచి 16న ఉదయం 6 గంటల వరకు గేటు మూసివేయనున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రత్యామ్నాయ మార్గాలలో రాకపోకలు సాగించాలని సూచించారు.

దుకాణాల అద్దెలు సకాలంలో చెల్లించండి

విజయనగరం రింగురోడ్డు, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధీనంలోని దుకాణాల అద్దెలను సకాలంలో చెల్లించాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది న్యూ ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు దుకాణాల అద్దె బకాయిలు పేరుకుపోవడంతో సదరు దుకాణాల సీజ్ చేశారు.

ఎవరిపైనా కక్ష సాధింపుల్లేవ్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున



మాట్లాడుతున్న నాగార్జున

విజయనగరం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఓ ఒక్కరిపైనా కక్ష సాధింపు చర్యలకు దిగడం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున స్పష్టం చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీయే అటువంటి చర్యలకు గతంలో దిగిందన్నారు. ఆ విషయం వైసీపీ నాయకులకు బాగా తెలుసునన్నారు. మద్యం షాపుల వేలం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందన్నారు. దీనిపై వైసీపీ నాయకులు అవాస్తవాలు చెబుతున్నారన్నారు. వాటిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఇక అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. రైతులు, పరిపాలన, పారదర్శకత కోసం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. ప్రజలు, రైతులు, కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పాటు పడుతున్నారని నాగార్జున వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



ఆలయంలో ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మధుపాడలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత రక్షాబంధనం, పరిషత్, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, పంచగవ్య ప్రాశనం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, వైసీపీ నాయకులు అంబళ్ల శ్రీరాములునాయుడు, మత్స సత్యనారాయణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లం అప్పారావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

పదోన్నతులు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విజయనగరం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు పదోన్నతి కల్పించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి సూరిబాబు, అధ్యక్షుడు జోగారావు డిమాండ్ చేశారు. బుధవారం డీఈవో మాణిక్యం నాయుడుకు వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, 2021-23లో రేషనలైజేషన్‌కు గురైన పీఎస్, హెచ్‌ఎంలకు 2021 సంవత్సరానికి ముందు పనిచేసినా ఓల్డ్ స్టేషన్ పాయింట్స్‌ను మంజూరు చేయాలన్నారు. టీఎల్‌ఎస్‌లోని తప్పుల సవరణకు ఎంఈవోలకు అవకాశం కల్పించాలని వారు కోరారు.

'పల్లెబాటతో ఫలితం లేదు'



మాట్లాడుతున్న భీశెట్టి

విజయనగరం దాసన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం పేరిట స్వర్ణాంధ్ర సాధనకు 21, 22, 23 తేదీల్లో తలపెట్టిన అధికారుల పల్లెబాట వల్ల ఫలితం ఉండబోదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అక్కడిక్కడే పెన్షన్ మంజూరు చేసే అధికారం, బెల్టుషాపులు మూయించే అధికారం..పల్లెల్లో పర్యటించే వారికి లేకపోతే స్వర్ణాంధ్ర సంకల్పం నెరవేరదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై పునరాలోచించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగభూషణం, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రోక్ ఎనలైజేషన్ లెర్నింగ్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడాకారుడు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ బ్యాడ్మింటన్ కోచ్, బీఏఐ జాతీయ గ్రేడ్-1 కోచ్ గంట్రోతు శ్రీనివాసరావు రాసిన స్ట్రోక్ ఎనలైజేషన్ అండ్ లెర్నింగ్ పుస్తకాన్ని బుధవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆవిష్కరించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రచయితను ఎమ్మెల్సీ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీ సత్యశేఖర్, మల్లా వేణు, రంది కిశోర్, క్రీడాకారులు ఆనాల మోహన్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పరీక్షకు 90 రోజుల గడువు ఇవ్వండి



నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

విజయనగరం కలెక్టరేట్/దాసన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులకు పరీక్ష సమయం గడువు 90 రోజులు ఇవ్వాలని, జిల్లాకు ఒకే పేపర్ విధానం అమలు చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఎక్కువగా సిలబస్ ఉందన్నారు. వాటి ప్రిపరేషన్‌కు కనీసం 90 రోజుల సమయం అవసరమన్నారు. అలాగే వయో పరిమితి 47 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఓపెన్ డిగ్రీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం డీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోని జిల్లా కన్వీనరు హరీష్, సంఘ నాయకులు భాను, ఈశ్వరరావు, శ్రీను, కిశోర్ పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన అలమండ వీఆర్వో

● రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వేణు



ఏసీబీకి పట్టుబడిన వీఆర్వో వేణు

జామి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండకు చెందిన వీఆర్వో ఆర్నేపల్లి వేణు మంగళవారం రాత్రి ఏసీబీ అధికారులకు చిక్కాడు. రూ.15 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదుదారుడు, ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అలమండ గ్రామానికి చెందిన మిడతాన వెంకట సత్య అప్పలనాయుడు తన తల్లి మిడతాన సూరిడమ్మ పేరిట సర్వే నెంబర్ 479-1ఎ, 1ఎలో 30 సెంట్ల భూమిని విజయనగరం-కొత్తవలస ప్రధాన రహదారిలో కొనుగోలు చేశారు. అందుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం కోసం మండల రెవెన్యూ కార్యాలయానికి కొద్దిరోజుల కిందట దరఖాస్తు చేశారు. మిడతాన కొనుగోలు చేసిన భూమి మ్యుటేషన్‌ను వీఆర్వో వేణు చేయాల్సి ఉంది. అయితే ఈ భూమి చాలా విలువైనదని, సెంటుకు రూ.వెయ్యి చొప్పున రూ.30 వేలు లంచం కోసం పట్టుబట్టాడు. ముందుగా రూ.15 వేలు ఇస్తే పని మొదలుపెడతానని కండీషన్ పెట్టాడు. పట్టాదారు పుస్తకం కోసం కాళ్లరిగేలా తిరిగిన అప్పలనాయుడు చివరకు విజయనగరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం అలమండ చేరుకున్న ఏసీబీ డీఎస్పీ రమ్య, సీఐ మహేశ్వరరావు వీఆర్వో కోసం కాపుకాశారు. రాత్రి సమయంలో గ్రామ సచివాలయం పక్కనే నివాసం ఉంటున్న వీఆర్వో తన ఇంటి దగ్గర డబ్బులు తీసుకున్న సమయంలో అధికారులు పట్టుకున్నారు. విశాఖ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో వృద్ధుడికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మహిళా పోలీసు స్టేషన్‌లో 2023లో నమోదైన పోక్సో కేసులో నగరానికి చెందిన చింతాడ అంజిబాబు(72)కు పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి చెందిన కింతాడ అంజిబాబు ఆరేళ్ల బాలికను లైంగికంగా వేధించాడని చిన్నారి తల్లి మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. అప్పటి మహిళా పోలీసుస్టేషన్ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసి ప్రాసిక్యూషన్ పూర్తయ్యే విధంగా మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు చర్యలు చేపట్టారన్నారు. నేరం రుజువు కావడంతో అంజిబాబుకు న్యాయాధికారి శిక్షను ఖరారు చేశారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసం

● ఓ యువతి ఖాతా నుంచి రూ.4.17 లక్షల మాయం

శృంగవరపుకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో ఓ యువతి మోసపోయింది. ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4.17 లక్షలు మాయమయ్యాయి. బుధవారం శృంగవరపుకోట పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సీఐ నారాయణమూర్తి అందించిన వివరాల ప్రకారం.. ఈనెల 12 మండల పరిధిలోని ఓ యువతి వాట్సాప్‌కు గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్ ద్వారా షేర్‌చాట్ లింక్ పంపి ఆమె నుంచి టాస్కులు చేయించి డబ్బులు పడినట్టు మోసపూరితంగా చూపించారు. ఆ తర్వాత ఆమె బ్యాంకు ఖాతాలోని రూ.4.17 లక్షలు మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పిడుగుపాటుకు గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

నెల్లిమర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పెదబూరాడపేటలో బుధవారం సాయంత్రం పిడుగు పడటంతో 8 గొర్రెలు మృతి చెందాయి. అదే గ్రామానికి చెందిన డొప్పా త్రినాథ.. పొలంలో గొర్రెలు మేపుతుండగా పిడుగు పడింది. గొర్రెలు మృతిచెందడంతో బాధితుడు త్రినాథ లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరాడు.

ఇద్దరికి గాయాలు

శృంగవరపుకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆటోను నిర్లక్ష్యంగా నడపడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాల పాలయ్యాయి. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు శృంగవరపుకోట పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఎస్.కోట వైపు నుంచి ఆటోను నిర్లక్ష్యంగా డ్రైవర్ నడుపుతూ బొడ్డవర వైపు వెళ్లేందుకు ఆగి ఉన్న మరో ఆటోను ఢీకొట్టాడు. దాంతో అందులో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి.

చెట్టును ఢీ కొట్టిన లారీ

వేపాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మదేవిపేట సమీపంలో బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో నిద్రమత్తులో డ్రైవర్ తాటిచెట్టును లారీతో ఢీకొన్నాడు. మండలంలోని వావిలపాడు క్రషర్‌కు లారీ వెళ్తున్న సమయంలో ఘటన జరిగింది. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

తప్పిన పెనుప్రమాదం

జామి, మే14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపాలెం గ్యాస్ గోదాం వద్ద కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బుధవారం వేకువ జామున విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దాంతో విద్యుత్ స్తంభం కూలింది. ఈ విషయంపై ఏఈ తేజేశ్వరరావు మాట్లాడుతూ ఘటనా స్థలలాన్ని పరిశీలించామన్నారు. ట్రాక్టర్ యాజమాని నుంచి రూ.18 వేలు పరిహారం వసూలు చేశామన్నారు. కొత్త స్తంభం వేసి విద్యుత్ సరఫరాను త్వరలో పునరుద్ధరిస్తామన్నారు.

అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

గంట్యాడ, మే 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో 'మట్టి వ్యాపారం' శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దానిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు. దాంతో బుధవారం వీఆర్వోలతో తహశీల్దారు సమావేశమయ్యారు. గ్రామాల్లో మట్టి తవ్వకాలకు వినియోగించే యంత్రాలను చట్ట ప్రకారం సీజ్ చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

షేడ్ నెట్ హౌసింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బొండపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మహిళా రైతులను ప్రోత్సాహించడానికి షేడ్ నెట్ హౌసింగ్ పథకాన్ని రాయితీపై అందజేస్తున్నామని ఉద్యానవన శాఖాధికారి రాజశేఖర్, ఏపీఎం కె.పెంటంనాయుడు బుధవారం వారు బొండపల్లిలో మాట్లాడారు. ఈ పథకం ద్వారా తీగ జాతి కూరగాయలు మినహా మిగిలిన అన్ని రకాల కూరగాయల పంటలు పండించుకోవచ్చన్నారు. ఇందుకుగానూ ఉద్యానవనశాఖ 50 శాతం రాయితీ ఇవ్వనుందన్నారు. మిగిలిన 50 శాతం రాయితీ వెలుగు పథకం లేదా బ్యాంకు ద్వారా నిధులు అందిస్తామన్నారు. మహిళా రైతుల పేరిట 20 సెంట్ల మెట్టు భూమి, అందులో బోరుబావి తప్పనిసరిగా ఉండాలన్నారు. సదరు మహిళ డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలన్నారు. ఆసక్తి గలవారు వెలుగు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి కృషి

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు

తెర్లాం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని లింగాపురం-అంట్లవార గ్రామాల మధ్య బీటీ రహదారి నిర్మాణానికి బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడితో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు భ్రష్టుపట్టుకుపోయాయని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే నియోజకవర్గం అంతటా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అంతకు ముందు సింగిరెడ్డివలసలో రామాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, రాష్ట్ర వాణి జ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి నర్సుపల్లి వెంకటేశ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిబద్ధతతో చేపట్టాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 'బీట్ ద హీట్ ' నినాదంతో ముందు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఈసారి జిల్లా మంచి ర్యాంకును సాధించాల న్నారు. మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూ.15 వేలను మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలో 556 సామాజిక మరుగుదొడ్లు మంజూరు చేశామని, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వాటి నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చూడాలని సూచించారు. 80 గ్రామ పంచాయతీ భవనాలను నిర్మాణానికి స్థలాలు, నిధులను మంజూరు చేశామని, ఈ నెలా ఖరులోగా గ్రౌండింగ్ అయ్యేలా డీపీవో బాధ్యత వహించాలన్నారు. 248 గ్రామాల్లో మలేరియా గుర్తించామని, సుమారు 50 వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రతి ఇంటిలో ఐఆర్ఎస్ స్ప్రే కార్యక్రమాన్ని జూన్ 15 వరకు నిర్వహిస్తామన్నారు. పంచాయతీల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ మెషీన్లతో పాటు క్లోరినేషన్, బ్లీచింగ్, మలాథియాన్ వంటి వాటిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గిరి చైతన్యం వాహనాలు త్వరలో రానున్నాయని తెలిపారు.

రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

బాడంగి, మే 14(ఆంధ్రజ్యోతి): రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వందమంది ఎస్సీ అభ్యర్థులకు ఈనెల 16న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ అభ్యర్థులంతా స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని అర్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు. మండలానికి 16 యూనిట్లు మంజూరయ్యాయని, మండలానికి రూ.66లక్షల లక్ష్యం ఇవ్వగా ఇందులో దాదాపు రూ.37.23 లక్షలు బ్యాంకులు రుణాలు ఇవ్వనున్నాయని చెప్పారు. లబ్ధిదారుల వాటా కింద రూ.3లక్షల 30వేలు, సబ్సిడీ కింద రూ.25లక్షల 50వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ● గరుగుబిల్లి: మండలంలో స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకున్న ఎస్సీ లబ్ధిదారుల దరఖాస్తులను ఈనెల 16న పరిశీలిస్తామని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 16 యూ నిట్లు మంజూరు కాగా, వీటి కోసం 25 పంచాయతీల పరిధిలోని 115 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఆమె చెప్పారు. దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలతో విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బొబ్బిలి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గల మద్యం దుకాణాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు బుధవారం తనిఖీ చేశారు. ఆయనతో పాటు బొబ్బిలి ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు ఉన్నారు. ముందుగా లిక్కర్ ఇండెంట్లను తనిఖీ చేసి, స్టాక్‌ని పరిశీలించారు. అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయో.. లేదో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సీసాపై ఉండే కోడ్‌ను స్కానింగ్ చేసిన తర్వాతే విక్రయించాలని సూచించారు. షాపుల పరిసర ప్రాంతాల్లో పర్మిట్ రూములు ఏర్పాటు చేసి, మ ద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీర్మానాల ఆధారంగా పనులు చేయించాలి

సీతానగరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులన్నీ గ్రామసభల్లో ఇచ్చిన తీర్మానం ఆధారంగా చేయించాలని ఏపీవో బాలకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ జేఈ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో టీఏలు, క్షేత్ర సహాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశాలకు వచ్చిన క్షేత్ర సహాయకులందరూ గ్రామసభ తీర్మానాలను విధిగా తేవాలన్నారు. అలాగే నిర్దేశించిన ఫాంపాండ్స్ లక్ష్యాలను ప్రతి పంచాయతీ నెరవేర్చాలన్నారు. బీమా పత్రాలు, బ్యాంకు అకౌంట్ తీసుకోవాలని కోరారు. ప్రతి వేతనదారుని బీమా సౌకర్యం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, నీరు, టెంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

రామభద్రపురంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

రామభద్రపురం, మే 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను స్థానిక అధికారులు బుధవారం తొలగించారు. ఉదయం నుంచే ప్రొక్లయినర్ సహాయంతో ఆక్రమణలు తొలగించారు. స్థానిక తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వీఆర్వోలు, పోలీసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వ్యాపారులు ఈ ఆక్రమణల తొలగింపునకు సహకరించారు.

గృహాలకు దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని అర్హత కలిగిన లబ్ధిదారులు గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల గృహ నిర్మాణశాఖ ఏఈ వంగపండు అఖిల్ నాయుడు కోరారు. బుధవారం ఆయన స్థాని క విలేకర్లతో మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో 1,745 మంది నమోదు చేసుకున్నార ని తెలిపారు. పీఎంఏవై 2.0 పథకంలో దరఖా స్తు చేసుకున్న వారికి ముందు ఓటీపీ వస్తుం దన్నారు. లబ్ధిదారులకు చెందిన కుల ధ్రువీ కరణ, ఆదాయం, స్థలానికి చెందిన పత్రాలు అందించాలన్నారు.

నిర్వహణ లేక.. శిథిలావస్థకు చేరి

● ఇదీ సీతయ్యపేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ దుస్థితి

బొబ్బిలి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేట గ్రామంలో గత టీడీపీ హయాంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. నిర్వహణ లేక, అధికారులు పట్టించుకోకపోవడంతో గోడలు బీటలు వారాయి. అలాగే చెత్తను తరలించే రిక్షా మూలకు చేరింది. దీంతో గ్రామంలో సేకరిస్తున్న చెత్తను పొలిమేరల్లో వేసి, మంట పెడుతున్నారు. చెత్త నుంచి సంపద తయారు చేసి, పంచాయతీ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీ ఈనాడు ఇలా నిర్వహణ లేక నిరుపయోగంగా మిగిలింది. 2018లో దాదాపు రూ.3లక్షలతో నిర్మించిన ఈ సంపద కేంద్రం చివరకు శిథిలావస్థకు చేరుకుంది. ఇలా ప్రజా ధనం దుర్వినియోగం కావడంతో గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరి దీనిని వినియోగంలోకి తీసుకొస్తారో.. మరో కొత్త షెడ్డు నిర్మాణానికి రూపకల్పన చేస్తారో చూడాలి.



సీతయ్యపేటలో చెత్త సంపద కేంద్రం భవనానికి బీటలు వారిన దృశ్యం, ఇన్‌సెట్‌లో మూలకు చేరిన రిక్ష

శ్యామలాంబ పండుగకు బస్సులు సిద్ధం

పార్వతీపురంటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సాలూరు ప్రజల ఇలవేల్పు శ్యామలాంబ జాతరకు ఐదు జిల్లాల నుంచి 1,240 బస్సులు నడుపుతున్నట్టు జిల్లా ప్రజారవాణా శాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక డీపీటీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుమారు 20 ఏళ్ల తర్వాత శ్యామలాంబ జాతరను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐదు జిల్లాల నుంచి సుమారు 10లక్షల మంది అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని, కలెక్టర్ ఆదేశాల మేరకు బస్సులు నడుపుతున్నామని చెప్పారు. జాతరను పురస్కరించుకుని 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆయా జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా సుమారు 1.50 లక్షల మంది ప్రజలు రావచ్చునని అంచనా వేశామన్నారు. ప్రయాణికుల సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం అన్న నినాదంతో శ్యామలాంబ జాతరకు విశాఖపట్నం డిపో నుంచి విజయనగరం మీదుగా సాలూరుకు 250 బస్సులు, విజయనగరం డిపో నుంచి సాలూరుకు 220, పార్వతీపురం డిపో నుంచి 170, బొబ్బిలి నుంచి 126, శ్రీకాకుళం జిల్లా పలాస, టెక్కలి నుంచి 120, శ్రీకాకుళం జిల్లా 1 నుంచి పాలకొండ, రాజాం మీదుగా 150, శ్రీకాకుళం జిల్లా 1, 2 డిపోల నుంచి 100, పాచిపెంట నుంచి 50, దుగ్గేరు నుంచి 12, శంబర నుంచి 14, బొబ్బిలి బస్‌స్టేషన్ పరిధిలో గల బలిజిపేట, వాడాడ, నారాయణపురంల నుంచి 14, తోణాం నుంచి 14 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారే చెప్పాలా?

(ఐదో పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు మంచినీళ్లు కూడా ఇవ్వలేమా? అంటూ ప్రశ్నించారు. ఏదేమైనా ఉత్సవాలకు సమయం సమీపిస్తున్నందున.. మంజూరైన నిధులతో పనులు వేగవంతంగా జరపాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఈనెల తొమ్మిదో తేదీన టెండర్లు పిలిచారు. అయితే కొద్దిమంది టెండరు దారులే ముందు కొచ్చారు. తక్కువ మొత్తానికి ఎవరైతే టెండర్ వేస్తారో వారికి పనులు అప్పగించాల్సి ఉంది. అయితే ఇంతవరకు వర్క్ ఆర్డర్లు ఇవ్వలేదు. దీంతో అభివృద్ధి పనులు పండుగ లోపు జరిగేనా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

గత సమస్యలు పునరావృతం కాకుండా..

సాలూరులో 2010లో జరిగిన శ్యామలాంబ ఉత్సవాల్లో ప్రధానంగా విద్యుత్ సమస్య వేధించింది. దీంతో గత సమస్యలు పునరావృతం కారాదని మంత్రి ముందుగానే ఆలోచించారు. ఆ శాఖకు సుమారు రూ.కోటి కేటాయించారు. ఈ నిధులతో సంబంధిత అధికారులు ఇప్పటికే పట్టణంలో 20 ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు వందకు పైగా విద్యుత్ స్తంభాలు వేయించారు. ఈ సారి ఉత్సవాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఇకపోతే మున్సిపాల్టీకి మంజూరు చేసిన రూ. రెండు కోట్లలో కొంతమొత్తాన్ని తాగునీరు, పారిశుధ్యం, ఇతర సేవల కోసం వెచ్చించాల్సి ఉన్నా.. ఆ దిశగా అధికారులు, వైసీపీ పాలక వర్గం చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే పండగ సందడి ప్రారంభమైన నేపథ్యంలో త్వరితగతిన పనులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వర్క్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది..

పనులకు సంబంధించి కొంతమంది టెండర్‌దారులు ముందుకు వచ్చారు. దీనిపై అత్యవసర సమావేశం నిర్వహించాం. వర్క్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది.

- డీటీవీ కృష్ణారావు, కమిషనర్, సాలూరు మున్సిపాల్టీ

రసాభాసగా మున్సిపల్ అత్యవసర సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

సాలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన శ్యామలాంబ పండగ సందర్భంగా బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశం రసాభాసగా మారింది. ఎజెండాలోని పలు అంశాలను మున్సిపల్ అధికారులు చదివి వినిపించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తెచ్చిన రూ.2 కోట్లు పనులు చేయకపోవడం పట్ల టీడీపీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. తమకు ప్రోటోకాల్ పాటించడం లేదని వైసీపీ కౌన్సిలర్లు రాపాక మాధవరావు, వంగపండు అప్పలనాయుడులు అధికారుల తీరుపై మండిపడ్డారు. మున్సిపాలిటీలో తాగునీటి పథకాలు 29 వార్డుల్లో కాకుండా ఎక్కడ అవసరం అయితే అక్కడ వేయాలని పలువురు కౌన్సిలర్లు అధికారులకు సూచించారు. పారిశుధ్య సేవల కోసం కేవలం అమ్మవారి పండుగ సందర్భంగా 4 రోజులకే ఆయా సరుకులు తేవడం పట్ల 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ హర్షవర్ధన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ చేస్తే సరిపోతుందా కనీసం ఒక 15 రోజులకైనా పారిశుధ్య సేవలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పండుగ విజయవంతంగా నిర్వహించడం ఇష్టంలేదా?

సాలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ అమ్మవారి పండుగను విజయవంతంగా నిర్వహించడం మున్సిపల్ పాలకవర్గానికి ఇష్టంలేదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి) ఆరోపించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 15 ఏళ్లుగా నిర్వహించని సాలూరు గ్రామదేవత శ్యామలాంబ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా మార్చి నెలలో సుమారు రూ.2 కోట్లు నిధులను తీసుకొచ్చారని తెలిపారు. అయితే ఈ నిధులు తెచ్చి దాదాపు 2 నెలలు కావస్తున్నా ఖర్చు చేయడానికి మున్సిపల్ పాలక వర్గం ముందుకు రావడంలేదని అన్నారు. పండుగ విజయవంతంగా నిర్వహిస్తే మంత్రికి ఎక్కడ మంచిపేరు వస్తుందేమోనని పాలకవర్గం భావిస్తోందని ఆయన ఆరోపించారు. 19వ వార్డు కౌన్సిలర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ పాలకవర్గంలో వైసీపీ సంఖ్యా బలం ఎక్కువగా ఉండడంతో ప్రతి విషయానికి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకుడు పప్పల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పాలకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్న కాపు వీధి కూడలిలో బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు గుమ్మడి సింహాద్రి, సీహెచ్ శివానంద్, అంపోలు శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆనాపు జవరాజు సమక్షంలో కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ నాయకులు శానపు సర్వారావు, గార దుర్గారావు, స్కూల్ కమిటీ చైర్మన్లు ఉదయాన పాపినాయుడు, పేకేటి నీలకంఠం, ఎన్ని ప్రసాద్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు

రామభద్రపురం, మే 14(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆమె సందర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై ఎక్కువగా దృష్టి సారించామన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

పార్వతీపురంటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, కోశాధికారులు బీవీ రమణ, జీవీ రమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ● ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ● పాలకొండ: రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. బుధవారం పాలకొండలో ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆయన ఆవిష్కరించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గురుబిల్లి అప్పలనాయుడు, కిమిడి రామ్మూర్తినాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వావిలపల్లి రమణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు సోంబాబు, గుడివాడ నీటి సంఘం అధ్యక్షుడు ఎద్దుబోయిన సింహాద్రి పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస: కొమరాడ మండల కేంద్రంలో ఈనెల 20న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం జియ్యమ్మవలసలో పోస్టర్‌ను విడుదల చేశారు. సీఐటీయూ నాయకులు కొల్లి సాంబమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాము, రైతు సంఘం నాయకుడు కృష్ణ, ఆటో యూనియన్ నాయకుడు అంజి తదితరులు పాల్గొన్నారు. ● మక్కువ: ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జి.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవార మక్కువలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు. ● సీతానగరం: ఈనెల 20న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీతానగరంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, రైతు సంఘం నాయకులు వీవీ రమణ, ఆర్.లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ప్రమాదాలు జరగవా?

● రహదారుల పక్కనే గృహ నిర్మాణ సామగ్రి

వీరఘట్టం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమికెల్ల, విక్రపురం గ్రామాల్లో పార్వతీపురం-వీరఘట్టం ప్రధాన రహదారిపైన ఇసుక, ఇటుకలు, చిప్స్ తదితర ఇంటి సామగ్రి వేస్తున్నారు. దీంతో రాత్రి సమయాల్లో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిపైన ఉన్న వాటిని తొలగించి ప్రమాదాలు జగరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నడిమికెల్లలో రహదారి పక్కన వేసిన ఇంటి సామగ్రి

తవ్వేశారు.. వదిలేశారు

● పోలీసుస్టేషన్ ఎదుట కాలువ తవ్వేసి.. కల్వర్టు నిర్మించని వైనం

● వాహన రాకపోకలకు వీలుకాక ఇబ్బంది పడుతున్న పోలీసులు

పాలకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ప్రజలకే కాదు.. పోలీసులకు సైతం నగర పంచాయతీ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. గత నెల 5న వీధి కాలువలు పూడికలతో నిండిపోవడంతో పోలీస్‌స్టేషన్ నుంచి ఆంజనేయ సెంటర్ వరకు రహదారిపై మురుగునీరు ప్రవహించింది. ఇలా రోజుల తరబడి ప్రవహిస్తుండడంతో స్థానికులు రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. దీంతో అధికారులు కాలువల ను తవ్వేసి మురుగునీరు తీశారు. ఈ సమస్యను పరిష్కరించారని అనుకున్నా నెల రోజులు కావస్తున్నా పోలీస్‌స్టేషన్ ఎదుట కల్వర్టును ఏర్పాటు చేయలేదు. పోలీస్‌స్టేషన్‌కే ఈ పరిస్థితి వచ్చిందంటే సామాన్యుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రజలు గుగుసలాడుకుంటున్నారు. కల్వర్టు నిర్మించకపోవడంతో పోలీస్ వాహనాలు స్టేషన్‌లోనికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పోలీసులు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం నగర పంచాయతీ ఏఈ వద్ద వివరణ కోరగా.. కల్వర్టుకు లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని, దీని కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట కల్వర్టు నిర్మించకపోవడంతో దారి లేని దృశ్యం

న్యూస్ బాక్స్

రైతులు అప్రమత్తంగా ఉండాలి

భామిని, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులు పాటు ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని.. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ సూచించారు. బుధవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి, గ్రామాల్లో దండోరో వేయించారు. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు వాతావరణంలో మార్పులు కనిపిస్తే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. చెట్లు కింద ఉండరాదన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రాయుడు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

బొబ్బిలి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సీహెచ్‌సీలో ఆరోగ్యమిత్రగా పనిచేసిన పక్కి గ్రామానికి చెందిన శీర గౌరినాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబానికి తోటి ఆరోగ్య మిత్రలు అండగా నిలిచారు. జిల్లా ఆరోగ్యశ్రీ యూనియన్ ఆధ్వర్యంలో రూ.71వేలు సేకరించి ఆ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆయన భార్య సరస్వతికి బుధవారం పక్కి గ్రామంలో అందజేశారు. ఆరోగ్య మిత్రలు రాంబాబు, శంకరరావు, విటల్ కుమార్ పాల్గొన్నారు.

నీటి తొట్టెల పరిశీలన

సీతానగరం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుచ్చిమి గ్రామంలో నీటి తొట్టెలను జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపం ఉండకూడదని అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరగాలన్నారు. ఈ పరిశీలనలో ఆయనతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్‌వర్మ, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తా చాటిన 'గ్లోబల్'

రామభద్రపురం, మే 14(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారని కరస్పాండెంట్ పోల చంద్రమోహన్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 మంది విద్యార్థులకు 24 మంది అత్యధిక మార్కులు సాధించి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. మిగిలిన నలుగురు కూడా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. వరుసగా రెండో సారి 95 శాతం సాధించి జోనల్ స్థాయిలో రెండో స్థానం సాధించారన్నారు.

రేపు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

సీతంపేట రూరల్,మే 14(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పాలకొండ తాలుకా ఎన్నికలు ఈనెల 16వ తేదీన సీతంపేటలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర జేఏసీ (ఏపీజీఈఏ) అధ్యక్షుడు వై.సతీష్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ఎన్.భరత్ భూషణరాజ్‌లు బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు కె.శంకర్రావులు హాజరవుతారని పేర్కొన్నారు.

ఉత్తమ ఆలోచనలతోనే ఉన్నత శిఖరాలు

గరుగుబిల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఆలోచనలతోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని విశ్రాంత ఐఏఎస్ అధికారి, శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ శిక్షకుడు జె.మురళి అన్నారు. బుధవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో జీవిత మార్గదర్శకాలపై శిక్షణ నిర్వహించారు. జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మురళి పాల్గొని, మాట్లాడారు. సన్మార్గం వైపు నడవాలంటే ధ్యానం నిత్య జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఈ శిక్షణకు 80 మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో శిక్షకులు ఉదయభాస్కరరావు, శ్రీధర్, సోమశేఖర్, ఉమతో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.